ong-5_ong-5.qxd 3/5/2026 11:53 PM Page 1



## దామచర్ల సత్యకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు

**కొండపి, ప్రభాతవార్త**

రాష్ట్రం మారీ టైం బోర్డు చైర్మన్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాక కార్యదర్శి దామచర్ల సత్య పుట్టినరోజు వేడుకలు సందర్భంగా కొండేపి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు, దామచర్ల సత్య నలబై నాల్గోవ పుట్టినరోజు వేడుకలు ఆయన నివాసం గురువారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కొండపి మండలం నుండి టిడిపి నాయకులు భారీగా తరలివెళ్లారు ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొర్రెపాటి రామయ్య చౌదరి జిల్లా యువత అధికార ప్రతినిధి నేతి రవికుమార్, మండల అధ్యక్షుడు వసంతరాయుడు నారాయణస్వామి పొన్నలూరు మాజీ ఎంపిపి కొండ్రుగుంట శ్రీనివాసరావు కుంట పెద్ద కండ్లకుంట టిడిపి యువ నాయకుడు ఏడిద మేడిద గంగయ్య( విష్ణు )సత్యను కలిసి పుష్పగుచ్చంతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు,

## రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబానికి పోలీసుల ఆర్థిక చేయూత

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**




ప్రకాశం జిల్లా, కందుకూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న షేక్ సాజిద్ 2026 జనవరి 19న కందుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మరణించారు. తన కుటుంబానికి ఆర్థిక చేయూతగా 2009 బ్యాచ్‌కు చెందిన పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా సేకరించిన రూ.2,14,000/ను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు చేతుల మీదుగా కానిస్టేబుల్ తండ్రి బాషా కి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని, ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమంకు అన్ని చర్యలు తీసుకొని వారికి అన్నీ విధాల అండగా ఉంటామని తెలిపారు. తమ సహోద్యోగి విధి నిర్వహణలో మరణించిన కుటుంబానికి పోలీసు సిబ్బంది ఆర్థిక సహాయం అందించి అండగా నిలవడం అభినందనీయమన్నారు.

## అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, మండల న్యాయ సేవాధికారి కమిటీలు అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, ప్రాథమిక స్థాయిలోనే వ్యాజ్యాల పరిష్కారం మరియు చట్టాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. ఈరోజు 05. 03. 2026 గురువారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పానల్ న్యాయవాదులతో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ అర్హులైన కక్షిదారులకు ఉచితంగా న్యాయ సహాయం అందించాలనే ఉద్దేశంతో పనిచేసే న్యాయవాదులు యొక్క కృషి ఎంతో అభినందనీయమని ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చిన న్యాయవాదులను అభినందించారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారు రూపొందించిన ఈ జాబితాలో భాగమైనందుకు ప్రతి ఒక్క న్యాయవాది తమ యొక్క అమూల్యమైన పాత్రను పోషించి ఉచిత న్యాయ సహాయం అందించాలని అన్నారు. సంవత్సర ఆదాయం మూడు లక్షలు లోపు ఉన్నవారికి, స్త్రీలకు మరియు షెడ్యూల్ కులాలు మరియు జాతుల వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. వీర రాఘవులు న్యాయవాదులు పరుచూరి లక్ష్మీకుమారి, షేక్ అజీజ్, నాయుడు ఈశ్వరరావు, దేగల రాజేంద్రప్రసాద్ మరియు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు



## రేణింగవరంలో వినాయక డైరీ పెరుగు కల్తీపై తనిఖీ

**- నిర్వహించిన బాపట్ల జిల్లా ఆహార భద్రత అధికారి పి. ప్రవీణ్ కుమార్**

**జె. పంగులూరు మార్చి 5 ప్రభాతవార్త**





మండలంలోని రేణింగవరం గ్రామంలో వినాయక డైరీ పై పెరుగు కల్తీ గురించి వార్తాపత్రికలో వచ్చిన ప్రతికూల వార్తల ప్రకారం మండల తాసిల్దారి పోపూరి సింగారావు ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఆహార భద్రతా అధికారి పి. ప్రణీత్ కుమార్ వినాయకడైరీ డెయిరీ పార్లర్ల గురించి గురువారం విచారించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ఆహార భద్రత అధికారి పి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వినాయకడైరీ పై వార్తా పత్రికల కథనం ప్రకారం డైరీని పార్లర్ల గురించి విచారించి ఆపై మెస్సర్స్ తనిఖీ నిర్వహించి, పాలపై ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, పాల నమూనాలను తీసి, విశ్లేషణ కోసం హైదరాబాద్ ఫుడ్ లాబొరేటరీకి పంపించడం జరిగింద న్నారు. కార్యక్రమంలో తనిఖీ ఆర్ ఐ శ్వేత, వీఆర్వో సుమతి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శనగలు కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సొసైటీ అధ్యక్షులు రావుల సింగరకొండ

**జె. పంగులూరు మార్చి 5 ప్రభాతవార్త**



మండలంలోని కోటపాడు రైతు సేవా కేంద్ర పరిధిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా శనగ పంటను కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షులు రావుల సింగరకొండ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ శనగ పంట పండించిన రైతులు పంటను నమోదు చేయించుకున్న రైతులు సీఎం యాప్ లో రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుని మద్దతు ధర 5,875/ రూపాయలకు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి రాధాకృష్ణ, వీరగంధం వీరాంజనేయులు, తాటి చిన్న సుబ్బారావు, గడ్డం నాగేశ్వరరావు, గుంటుపల్లి జనార్ధన్ తదిత రైతులు, వ్యవసాయ సహాయకులు రోజి, వి.ఆ.ర్.ఓ.బుల్లియ, గడ్డం నాగేశ్వరరావు, గ్రామ నాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

## సత్ఫలితాలు ఇవ్వని రెవెన్యూ క్లినిక్‌లు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఖిరెవెన్యూ క్లినిక్‌ఖిలు లక్ష్యానికి దూరంగా సాగుతున్నాయి. రైతులు వ్యయప్రయాసలకోర్చి అర్జీలు ఇస్తున్నా ఫలితం ఉండడం లేదు. మార్కాపురం, ప్రకాశం జిల్లాల పరిధిలో మొత్తం 1,600 అర్జీలు రాగా 237 మాత్రమే పరిష్కారానికి నోచుకోవడం ఇందుకు నిదర్శనం. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడం ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో రెవెన్యూ సమస్యలు అధికం. పైగా గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో దొర్లిన తప్పులు... పంట రుణాలకే కాదు సంక్షేమ పథకాల లబ్ధికి సైతం రైతులకు అడ్డంకిగా మారాయి. ఈ చిక్కులకు పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ 29 నుంచి ఖిరెవెన్యూ క్లినిక్ ను అమల్లోకి తెచ్చింది. కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ఖిప్రజా సమస్యల పరిష్కార వేదికకు అనుబంధంగా వీటిని నిర్వహిస్తున్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు హాజరవుతున్నారు. కచ్చితంగా సమస్య తీరుతుందన్న ఆశతో వ్యయప్రయాసలకోర్చి దూర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలు అందజేస్తున్నా నిరాశే మిగులుతోంది. నేరుగా కలెక్టర్, జేసీ, డీఆర్వో,ఆర్డీవోల స్థాయిలో మొర పెట్టుకుంటున్నా ఫలితం లేకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వచ్చిన అర్జీలను యథాప్రకారం సంబంధిత మండల తహసీల్దార్లకు పంపిస్తున్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీగిరిలో భక్తులకు అందుబాటులో టిటిడి పంచాంగాలు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన శ్రీ పరాభవ నామ నూతన సంవత్సర తెలుగు పంచాంగాలను గురువారం నుండి భక్తులకు అందుబాటులో ఉంచినట్లు ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి వెల్లడించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ టిటిడి పంచాంగాలు కావలసిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో దేవస్థానం పని వేళలలో సంప్రదించాలని కోరారు,

# ఆ కుట్రలను బాలినేని ఛేదించగలరా..?

**ఒంగోలు, ప్రభాతవార్త**



మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కుట్ర జరుగుతుందా..? అన్ని పార్టీల్లో ఆయనకు ప్రత్యర్థులు ఉన్నారా..? ఆయన రాజకీయ ఎదుగుదలకు అడ్డుతగులుతున్నారా..? అందుకే ఆయన తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. యువజన కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న బాలినేని చిన్న వయసులోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. మూడో సారి గెలిచి మంత్రి కూడా అయ్యారు. అయితే పదవీ కావాలా విశ్వసనీయతకు పెద్దపీట వేయాలా అంటే రెండో దానిని ఆయన ఎంచుకున్నారు. అలా జగన్‌మోహన్‌రెడ్డి వెంట అడుగులు వేశారు. ఎమ్మెల్యే పదవితో పాటు మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక నిజమైన నాయకుడిగా చిత్తశుద్ధితో తన బాధ్యతలను నిర్వర్తించారు. అయితే అనుకోని రీతిలో పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన గూటికి చేరారు. జనసేనలో తన పరిధి పెంచుకుంటున్న తరుణంలోఆయన చుట్టు కుట్రలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం పార్టీ హవా నడుస్తున్న రోజులు అవి. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేసే వారు బాలినేని శ్రీనివాసరెడ్డి. 1999 ఎన్నికల్లో ఒంగోలు టిక్కెట్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయనకు కట్టబెట్టారు. 1991లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఆయన ప్రతిపక్ష పార్టీలో ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2003లో పాదయాత్ర సమయంలో ప్రకాశం జిల్లాలో అత్యంత కీలకంగా వ్యవహరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని బాలినేని శ్రీనివాసరెడ్డి ఎంతో ఆకర్షించారు. 2004లో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2009లో ముచ్చటగా మూడో సారి ఒంగోలు అసెంబ్లీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాలినేనిని పిలిచి మరి మంత్రి పదవి ఇచ్చారు. అయితే తనకిష్టమైన రాజశేఖర్‌రెడ్డి అకాల మరణంతో చాలా బాధపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడంతో మంత్రి పదవిని వదులుకుని ఆ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి 2012లో జరిగిన ఉప ఎన్నికలకు వెళ్లారు. ఆ ఎన్నికల్లో గెలిచారు. కానీ 2014 ఎన్నికల్లో రెండో సారి వైసీపీ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఐదో సారి వైఎస్సార్‌సీపీ తరుపున గెలుపొందారు. జగన్ మంత్రి వర్గంలో మూడేళ్ల పాటు మంత్రి పదవి బాధ్యతలు చేపట్టారు. 2022లో కొత్త వారికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్న ఉద్దేశంతో కొంత మంది మంత్రులను తొలగించి కొత్త వారికి బాధ్యతలు అప్పగించడం జరిగింది. దాంతో బాలినేని కొంచెం అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ ఓడిపోయారు. అయితే తాను ఎంతో విశ్వసనీయత చూపితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ నుంచి ఆశించిన స్థాయిలో గౌరవం దక్కకపోవడంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు బాలినేని. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి నేతల నుంచి దిగువ స్థాయి నేతల వరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టార్గెట్ చేసుకునే వారు. అధికార మదంతో అనుచిత కామెంట్ చేసేవారు. కానీ ఒక్క బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం పవన్ కళ్యాణ్ విషయంలో పల్లెతిమాట అనలేదు. చాలా గౌరవంతో మెలిగే వారు. పవన్ కళ్యాణ్ సైతం బాలినేని విషయంలో అదే గౌరవ భావంతో చూసేవారు. 2024 ఎన్నికల తరువాత బాలినేని శ్రీనివాసరెడ్డి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పని చేసేందుకు ముందుకు వచ్చారు. కానీ తెలుగుదేశం పార్టీ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, జనసేనలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది పవన్ కళ్యాణ్‌పై ఒత్తిడి పెంచింది అయినా సరే పవన్ కళ్యాణ్ బాలినేని నాయకత్వంపై నమ్మకముంచి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డిది ప్రత్యేక స్థానం. అజాతశత్రువుగా పేరు పొందారు. ముఖ్యంగా మాగుంట శ్రీనివాసరెడ్డితో ఆయనకు మంచి సంబంధం ఉంది. ఎంపీగా మాగుంట, ఎమ్మెల్యేతో మంత్రిగా బాలినేని ఉంటే ప్రకాశం జిల్లా వారి కనుసన్నల్లో నడిచేది. రాజకీయ ప్రత్యర్థులకు అదే కంటగింపుగా మారింది. ఎందుకంటే బాలినేని సామర్థ్యం పవన్ కళ్యాణ్‌కు తెలుసు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇచ్చేందుకు పవన్ కళ్యాణ్ సైతం ఒక నిర్ణయానికి వచ్చారు. అయితే ఇదే మింగుడు పడని రాజకీయ ప్రత్యర్థులు బాలినేని శ్రీనివాసరెడ్డి చుట్టూ కుట్ర రాజకీయాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం బాలినేని శ్రీనివాసరెడ్డి విషయంలో అధికార విపక్ష నేతల కుట్ర స్పష్టంగా కనిపిస్తుంది. తెలుగుదేశం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బాలినేనిపై తీవ్ర ఆగ్రహంతో ఉంది. మరో వైపు జనసేనలో ఒక వర్గం ఇతను రాజకీయాల్లో ఉంటే మన మనుగడ కష్టమని భావించి వారు చేయదగ్గ పనులన్ని చేస్తున్నట్లు సమాచారం. బాలినేని రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపి ఉద్దేశపూర్వక కుట్రలు చేస్తున్నారు. అందులో భాగంగానే బాలినేనితిరిగి వైఎస్సార్‌సీపీలోకి వెళ్ళిపోతారన్న ప్రచారం చేస్తుంది. కానీ తనపై పవన్ కళ్యాణ్ ఉంచిన నమ్మకం ప్రకాశం జిల్లా ప్రజలకు బాలినేని నాయకత్వంపై ఉన్న ప్రగాడ నమ్మకం వంటివి ఆయనను నడిపిస్తున్నాయి. ముప్పెట కుట్రలను ఛేధిస్తానన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నారు బాలినేని.

## కల్తీకి రంగులెక్కువ 'అధికారుల తనిఖీలేమో తక్కువ'

**- ఇష్టారీతిన ఆహార పదార్థాలు విక్రయాలు**

**- కట్టడి దిశగా కానరాని యంత్రాంగం చర్యలు**

**ఒంగోలు, ప్రభాతవార్త**



పాలల్లో రసాయనాలు కలిసి రాజమహేంద్రవరం జిల్లా కోరుకొండ మండలం నరసాపురంలో పలువురు మృతి చెందారు. ఈ ఘటన తరువాత ఫుడ్‌సేఫ్టీ అధికారులు కళ్ళు తెరిచారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని దర్శి, అద్దంకి, ముండ్లమూరుతో పాటు పలు ప్రాంతాల్లో పాల కేంద్రాలు తనిఖీలు చేపట్టారు. ఆ ఘటనే చోటుచేసుకోకుంటే కదిలేవారే కాదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ విషయంలో అధికారుల నిర్లిప్తత ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా ఉందని మొక్కుబడి తనిఖీలు కల్తీ రాయుళ్ల ఆట కట్టిస్తాయా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో కృత్రిమ రంగులు వాడకూడదు. టెస్టింగ్ స్టాల్స్ వినియోగించరాదు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలో రహదారుల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. దాదాపు ప్రతి రెస్టారెంట్‌లో చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ లభ్యమవుతుంది. ఇక్కడి వంటకాల్లో కృత్రిమ రంగులు, టెస్టింగ్ స్టాల్స్ వినియోగిస్తున్నారన్నది బహిరంగ రహస్యమైన ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మాంసహార హోటళ్లలో వంటశాలలు తనిఖీ చేసినా సందర్భాల్లో రెండు వారాలకు మించి నిల్వ చేసిన పదార్థాలను అధికారులు ఇటీవల గుర్తించారు. వంట శాలల్లో ఎలుకలు, పందికొక్కులు, బొద్దింకలు, బల్లుల సంచారం చూసి అవాక్కయ్యారు. వంట శాలల్లో చెత్తకుప్పలు ఉంటున్నా వాటిని బయట వేసిన దాఖలాలు లేవు. టీస్టాళ్లకు సరఫరా చేస్తున్నా పాలు కల్తీ అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. చిక్కదనం పెంపునకు రసాయనాలు వాడుతున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ టీ పొడిని వినియోగిస్తున్న దాఖలాలు కొన్ని చోట్ల వెల్లడయ్యాయి. రంగు రుచి కోసం వినియోగించే రసాయనాల పైన దృష్టి పెట్టడం లేదు. వంట నూనెలు, సరుకుల కల్తీపై కనీస అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం లేదు. మసాలా దినుసులు, ధాన్యాలు, పప్పుల కల్తీని అరికట్టడానికి చర్యల్లేవు. ఇప్పటికైనా పటిష్ఠ తనిఖీ చేపట్టి కల్తీ రాయళ్ల ఆటకట్టించేలా ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాల తయారీ చోట పారిశుధ్య పరిస్థితులపై స్థానిక సంస్థల యంత్రాంగం నిఘా ఉంచితే ప్రజలకు ఎంతో మేలు.

## ఒంగోలులో ఖాళీ స్థలాల అమ్మకానికి సిద్ధమవుతున్న కార్పొరేషన్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఖాళీ స్థలాల విక్రయం ద్వారా నిధుల సమీకరణకు ఒంగోలు నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. ఇప్పటికే కొన్ని ఆస్తులను గుర్తించి. శాఖాపరమైన అనుమతులు పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. నగర నడిబొడ్డున 6.8 ఎకరాల విస్తీర్ణంలో సీఆర్పీ క్వార్టర్లు ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. భవనాల్లోని విలువైన ఫర్నీచర్ను దొంగలు ఎత్తుకుపోయారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా చిల్లచెట్లతో నిండి చిట్టడవిని తలపిస్తోంది. మరోవైపు క్వార్టర్లను ఆనుకొని ఉన్న స్థలాలను కొందరు ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పాత భవనాలను కూల్చేసి ప్లాట్లుగా విక్రయించాలన్న ఆలోచన చేస్తున్నారు. ఈ స్థలం రెవెన్యూ పరిధిలో ఉండగా రహదారుల భవనాల శాఖ వారు నిర్మాణాలు చేపట్టారు. స్థలం బదలాయింపునకు ఆయా శాఖల నుంచి నగరపాలక సంస్థ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఆ మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థలాల విక్రయం ద్వారా వచ్చే మొత్తాన్ని నగరంలో వసతుల మెరుగుకు వినియోగిస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు.పేర్నమిట్టలో కార్పొరేషన్కు చెందిన పదిన్నర ఎకరాల స్థలాన్ని సైతం ప్లాట్లుగా విభజించి విక్రయించాలని నిర్ణయించారు. కర్నూలు రోడ్డు చెంతనే ఉండడంతో మంచి డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. భాగ్యనగర్‌ను ఆనుకొని ఉన్న ఐడీఎస్ఎంటీ ప్లాట్లను విక్రయించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.

## ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌ని కలిసిన గంగాడ సుజాత

**ఒంగోలు, ప్రభాతవార్త**



అమరావతి సెక్రటేరియట్ నందు ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్‌ని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, 35 వ డివిజన్ కార్పొరేటర్ శాండిల్య కలిసి లేఔట్, మున్సిపల్ ఆఫీస్ బిల్డింగ్, మున్సిపల్ కార్పొరేషన్ నందు ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించవలసిందిగా కోరడం జరిగింది.



## దామచర్ల సత్యకు మంత్రి డోలా శుభాకాంక్షలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్ లో జరిగిన మ్యారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పుట్టినరోజు వేడుకల్లో మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు











**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఎన్జీవో హోమ్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని సుమారు 400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ముందుగా మహిళా ఉద్యోగినులు ఎన్జీవో హోమ్‌లో మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. మొదటి రోజు పాటల పోటీలు, టెన్నీ కొయిట్, మ్యూజికల్ చైర్స్ తదితర ఈవెంట్లకు పోటీలు జరుగగా అన్ని డిపార్టుమెంట్స్ ఉద్యోగినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. టెన్నికొయిట్ పోటీలను ఎస్‌డి షమ్మి,డి.జయమ్మ, కే.భూషమ్మ తదితరులు నిర్వహించగా, మొత్తం 32 జట్లు పాల్గొనగా మొదటి రౌండ్ పోటీలు పూర్తి అవ్వగా రెండో రౌండ్‌కు చేరిన జట్లకు పోటీలు రెండవ రోజు నిర్వహించబడునని తెలిపారు. పాటల పోటీలకు నిర్వాహకులుగా ఎస్.జ్యోతి, ఆర్.వందన,ఆర్.సునీల్ కుమారి, జి.దీప్తి తదితరులు నిర్వహించగా మొత్తం వివిధ డిపార్టుమెంట్స్ నుండి సుమారు 20 మంది ఉద్యోగినులు పాటల పోటీల్లో పాల్గొన్నారు. పాటల పోటీ విజేతలుగా 1వ స్థానం ఆర్.సునీల కుమారి ఆడిట్ శాఖ, 2వ స్థానం ఎం.సుజాత ఏఎన్ఎం, 3వస్థానం డాక్టర్ శ్రావ్య రిమ్స్‌లు గెలుపొందారు. ప్రోత్సాహక బహుమతి.. 1వ స్థానం ఎస్.నారాయణమ్మ ఏఎన్‌ఎం, 2వ స్థానం ఎస్.దేవమ్మ నీటి పారుదల శాఖ, మూడోస్థానం కే.శాంతిదేవి రిమ్స్.. విజేతలుగా నిలిచారు. పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ మాజీ జిల్లా కోశాధికారి, బొమ్మరిల్లు వ్యవస్థాపకులు కామ్రేడ్ పి.రాజ్యలక్ష్మి వ్యవహారించారు. మ్యూజికల్ చైర్స్ పోటీలను ఎస్.నారాయణమ్మ, ఎం.మల్లిక, ఎస్.వెంకట పుష్ప, జి.సుగుణ, శోభారాణి నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులుగా ఏపీఎన్జీవో అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కే.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు జిల్లా కన్వీనర్ సీహెచ్ శిరీష, పి.భారతి, ఎస్.జ్యోతి, ఎస్.నారాయణమ్మ, డి.నాగరాజు కుమారి, జి.శైలజా కుమారి, లక్ష్మీ రాజ్యం తదితరులు నిర్వహించగా, ఏపీఎన్జీవో అసోసియేషన్ ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజీష్ కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్, జిల్లా సహాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి కే.శివ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి బి.కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షులు బి.ఏడుకొండలు, ఆర్.దీపక్ కుమార్, బి.విజయ కుమార్, డి.మధుసూదన్‌రెడ్డి, వీరయ్య, జిలాని, అంకబాబు, లక్ష్మణ్, కమిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



**పెద్దదోర్నాల, మార్చి 5, ప్రభాతవార్త**
దోర్నాల మండలంలోని నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాలలో వ్యవసాయశాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్‌నాయక్ పాల్గొని మొక్కజొన్న, మిరప పంటలను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతు యాప్ ద్వారా కూడా తన యొక్క ఫోన్ ద్వారా కూడా ఈ పంట నమోదు చేసుకోవచ్చు. మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం, సర్వే పంట నష్టం, అధికారుల చరవాణి, చీడ పీడలు, అన్ని ఈ రైతు యాప్‌లోనే తెలుసుకోవచ్చు. కాబట్టి రైతులు తప్పనిసరిగా ఈ యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని వ్యవసాయ పథకాలు పొందవచ్చని తెలిపారు. అలాగే భూమి ఉన్న ప్రతి రైతు కూడా రైతు విశిష్ట నమోదు సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు విశిష్ట నమోదు సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ అవుతుందని రైతులకు తెలియజేయడం జరిగింది. కావున ఏపీఎఫ్ఆర్ నమోదు చేసుకోవాలని తెలిపారు. కంది పంట సాగు చేసిన రైతులు ప్రభుత్వ ధరకు అమ్ముకునేందుకు తప్పనిసరిగా సీఎం యాప్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఆధారంగా ఈకేవైసీ పూర్తి చేసి నమోదు చేసుకోవాలని, అలా నమోదు చేసుకున్న రైతులకు రూ.8వేలు క్వింటా మద్దతు ధరగా ఎకరానికి 4 క్వింటాల వరకు కొనుగోలు కేంద్రానికి కందులు అమ్ముకోవచ్చని తెలిపారు. రైతు యాప్ కూడా ప్రతి రైతు డౌన్‌లోడ్ చేసుకొని ఎప్పటికప్పుడు వ్యవసాయ సమాచారం, మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం, సర్వే, పంట నష్టం తదితర విషయాలు అన్ని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ పార్వతి బాయి, సొసైటీ డైరక్టర్ శేఖర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

## మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కలిసిన గురునాథం



**లింగసముద్రం, మార్చి 5, ప్రభాతవార్త**
గుడ్లూరు మండలంలోని సాలిపేట పంచాయతీ కర్లపాలెం గ్రామానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి భునిర్వాసితుల పునరావాస కాలనీకి ప్రారంభోత్సవం, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసి యున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని లింగసముద్రం మండల టీడీపీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన వధువు స్వప్నను ఆశీర్వదించిన బుర్రా



**లింగసముద్రం, మార్చి 5, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలంలోని ముత్తంవారి పాలెం గ్రామవాస్తవ్యులు బొల్లినేని నరసింహారావు, ధనలక్ష్మీ దంపతుల ఆహ్వానం మేరకు ఏకైక కుమార్తె స్వప్న, నాగనిఖిల్‌బాబు వివాహ వేడుకలలో మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని నూతన వధువు స్వప్నను అక్షింతలు వేసి ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, తోకల కొండయ్య,గణేశం గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు



**జరుగుమల్లి, మార్చి 5, ప్రభాతవార్త**
జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వైద్యాధికారి కావ్య రక్తపరీక్షలు నిర్వహించారు. జరుగుమల్లి ఉన్నత పాఠశాలలో 75 మందికి, చిర్రికూరపాడు ఉన్నత పాఠశాలలో 37 మందికి ఈ రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి కావ్య తెలియజేశారు. అదే విధంగా కే.బిట్రగుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.సుధాకరరావు,డి.అనురాధ,ఏఎన్ఎంలు ప్రమీల, నాగమణి, ఆశా కర్యకర్తలు నాగేశ్వరి, భారతి, రమాదేవి, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

## ఆర్‌జేఎస్‌టీ పాఠశాలను తనిఖీ చేసిన సమగ్ర శిక్ష జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్



**మార్టూరు, మార్చి5, ప్రభాతవార్త**
మార్టూరు గ్రామంలోని ఆర్‌జేఎస్‌టీ పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను చతుర్విధ ప్రక్రియల ద్వారా పరీక్షించారు. పాఠశాలకు సంబంధించిన వివిధ రిజిస్టర్లు, అపార్ నంబర్ల నమోదు పురోగతి,వలస వెళ్లే కుటుంబాల వివరాలపై చర్చించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న 75 రోజుల జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పురోగతిని పర్యవేక్షించారు. అమలు, బోధనలో జాదూ పిటారా కిట్ల వినియోగం, గ్రాంట్ల వినియోగం తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులు జయ కుమార్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్శనలో భాగంగా ఎంఈఓ ఆఫీస్ ని సందర్శించి సీజనల్ హాస్టళ్ల ప్రతిపాదనలు, అలాగే రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాల నుంచి పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం రవాణా భత్యం ప్రతిపాదనలు సమర్పణపై మండల సాంకేతిక సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీ రామారావు, రమేష్, మండల సాంకేతిక సిబ్బంది వాసు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## అసెంబ్లీని సందర్శించిన కొడవలివారిపాలెం విద్యార్థులు

### - ఎమ్మెల్యే ఏలూరితో ముచ్చట్లు



**మార్టూరు, మార్చి 5, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం లోని కొడవలివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనసభను సందర్శించారు. శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు సభ నిర్వహణ, చట్ట సభ కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హోంమంత్రి వంగలపూడి అనిత, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారు విద్యార్థులతో మాట్లాడి శాసనసభ ప్రాధాన్యత, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ప్రతినిధుల పాత్ర గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. శాసనసభ వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రత్యక్షంగా చూసే అవకాశం విద్యార్థులకు మంచి అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు. చట్టసభలు ఎలా పనిచేస్తాయి. ప్రజా సమసయలపై ఎలా చర్చలు జరుగుతాయి అన్న విషయాలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థులకు విస్తృతమైన అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. శాసనసభ సందర్శనపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి ఫొటోలు దిగారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలి

### - మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కిషోర్ కుమార్



**మార్కాపురం టౌన్, మార్చి 5, ప్రభాతవార్త**
మార్కాపురం కోర్టు పరిధిలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కిషోర్ కుమార్ పోలీసు అధికారులను కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. అన్ని రకాల రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు ఈ లోక్‌అదాలత్ నందు పరిష్కరించడం జరుగుతుందని న్యాయమూర్తి జె.కిషోర్ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



**తాళ్లూరు, మార్చి 5,ప్రభాత వార్త**
మండలంలోని తూర్పు గంగవరంలో తోటకూర గడ్డిలో నూతనంగా నిర్మించిన సద్గురు సాయినాథ్ మందిరంలో సాయిబాబాప్రతిష్ఠ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించి,సాయి బాబా మూలవిరాట్ ను ప్రాణప్రతిష్ట చేశారు. ప్రతిష్ఠ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తనయుని జన్మదిన వేడుకలు



**యర్రగొండపాలెం, మార్చి 5, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ తనయుడు చిరంజీవి అభిషిక్త్ జన్మదిన వేడుకలకు యర్రగొండపాలెం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు హాజరై అభిషిక్త్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ముకుమ్మడిగా కేక్ కట్ చేశారు. ఆ తరువాత చిరంజీవి అభిషిక్త్‌కు కార్యకర్తలు,నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే తనయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పుల్లలచెరువు మండల నాయకులు తమ్మినేని సత్తిరెడ్డి,ఎమ్మెల్యే పీఏ కోటి, సర్పంచ్‌లుఫిలిప్స్,దుగ్గెపూడి సుబ్బారెడ్డి,కరంతోటి సురేష్‌నాయక్, ఇలాకోటి శివారెడ్డి,రాగాల వెంకటయ్య, మండలాల నాయకులు,కార్యకర్తలతో పాటు ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాశికుంట తండా, కేజీబీవీ పాఠశాలలు సందర్శించిన నీతి ఆయోగ్ ప్రతినిధి



**యర్రగొండపాలె, మార్చి 5, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని కాశికుంట తండా,కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంను నీతి ఆయోగ్ నుండి వచ్చిన ప్రతినిధి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయలను సమగ్రంగా పరిశీలించారు. అదే విధంగా అక్కడ చదువుతున్న విద్యార్థినుల విద్యా సామర్థ్యాలు, వారి అభ్యాస విధానం, పాఠశాల నిర్వహణ, విద్యా కార్యక్రమాల అమలు తీరును కూడా పరిశీలించారు. విద్యార్థినులు చూపించిన ప్రతిభ, పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలు చూసి నీతి ఆయోగ్ ప్రతినిధి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు మరింత కృషి చేసి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. పాఠశాలలో అందుతున్న విద్యా వాతావరణం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఏ.ఆంజనేయులు, మల్లు నాయక్, ఏబీపీ ఫెలో మణి, తేజ, కేజీబీవీ ప్రిన్సిపాల్ తిరుమల దేవి, కాశి కుంట ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్, సీఆర్ఎమ్టీ ఎల్లయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా ప్రాంగణం ప్రారంభించిన ఎంఈఓ



**పుల్లలచెరువు, మార్చి 5, ప్రభాతవార్త**
మండలంలోని సిద్దనపాలెం గ్రామంలో మండలపరిషత్ పాఠశాల నందు విద్యార్థులకు క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన మండల విద్యాశాఖాధికారి వెంకట భాస్కర్ గురువారం టెన్నీస్, షటిల్, వాలీబాల్ కోర్టులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ముందుకు రాణించాలని తెలియజేశారు. అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ ఆట స్థలాలు ఉపయోగపడతాయన్నారు. విద్యతో పాటు క్రీడలను కూడా సమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడలు ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2ఇందిరాప్రసాద్,పాఠశాలప్రధానోపాధ్యాయులు తియోఫిలాస్,పాఠశాల సిబంది కాటమరాజు , విజయకుమార్‌నాయక్,సీఆర్ఎంటీమేరీ,ఎస్ఎంసీసభ్యులు,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వ నమోదుతో భీమా సౌకర్యం లభిస్తోంది



**పుల్లలచెరువు, మార్చి 5, ప్రభాతవార్త**
జనసేన సభ్యత్వ నమోదుతో భీమా సౌకర్యం లభిస్తుందని జనసేన మండల కన్వీనర్ కొఠారి అచ్చయ్య తెలిపారు. పుల్లలచెరువు మండల కేంద్రంలో గురువారం ఉద్యమంలా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత్వం పొందిన కార్యకర్తలకు భీమా లభిస్తుందన్నారు. సహజ మరణానికి 1 లక్ష, ప్రమాదవ శాత్తు మరణానికి రూ.5లక్షలు ఏదైనా ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం తక్షణమే ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉందన్నారు. రుసుము రూ.400 చెల్లించి జనసేన కుటుంబ సభ్యులుగా నమోదు కావాలని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. కార్యకర్తలకు, ప్రజలకు దేశంలోనే భరోసా కల్పిస్తున్న ఏకైక పార్టీ జనసేన మాత్రమేనన్నారు. సభ్యత్వ నమోదుకు గడువు ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే ఉందని అన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిద్ధి లక్ష్మయ్య, ఆర్మీ బుజ్జి, పసుపులేటి బుజ్జి, విష్ణు, శ్రీను, వీరమ్మ, వెంకీ, శివ, ఇస్సాకు, శ్రీను, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

## పలు నియోజకవర్గాలకు పార్టీ పరిశీలకులను నియమించిన వైసిపి

### - కొండేపి నియోజక వర్గ పరిశీలకులుగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్



**మార్కాపురం టౌన్, మార్చి 5, ప్రభాతవార్త**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని ఆయా నియోజక వర్గాలలో పార్టీ నిర్మాణంపై దృష్టి సారించింది. అందులో భాగంగా పార్టీ రాష్ట్ర కమిటీలో ఉన్న కీలక నేతలను జిల్లాలోని పలు నియోజక వర్గాలకు పార్టీ పరిశీలకులుగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర సెక్రెటరీగా ఉన్న డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ కొండేపి నియోజక వర్గానికి పార్టీ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈయన పార్టీ ఆవిర్భావం నుండి అదే పార్టీలో కొనసాగుతూ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈయన ప్రధానంగా మైనారిటీ వర్గంతో పాటు ఇతర సామాజిక వర్గాల్లో కూడా మంచి సౌమ్యులుగా పేరు తెచ్చుకున్నారు. అలాగే పార్టీకి వీర విధేయులుగా వుంటారని కూడా ఆ పార్టీ నాయకుల్లో అభిప్రాయం ఉండడం విశేషం. అలాగే ఈయన గత వైసిపి ప్రభుత్వ హయాంలో పార్టీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గాను, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొద్ది రోజుల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. దర్శి నియోజక వర్గానికి డాక్టర్ మదాసు వెంకయ్య, మార్కాపురం నియోజక వర్గానికి డాక్టర్ బత్తుల అశోక్ రెడ్డి, ఎర్రగొండ పాలెం నియోజక వర్గానికి పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి, గిద్దలూరు నియోజక వర్గానికి పార్టీ రాష్ట్ర సెక్రెటరీగా వున్న కెవి రమణా రెడ్డి, ఒంగోలు నియోజక వర్గానికి వై. వెంకటేశ్వరరావు, సంతనూతల పాడు నియోజక వర్గానికి బోట్ల రామారావు, కనిగిరి నియోజక వర్గానికి మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదేన్నలు నియమితులయ్యారు. నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన వీరందరూ ఆయా నియోజక వర్గాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలతోను అలాగే జిల్లా పార్టీ అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ మరోవైపు పార్టీ రాష్ట్ర కార్యాలయంతో అనుసంధానం చేసుకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నట్లు తెలిసింది. అలాగే ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం గత 20 మాసాల వైఫల్యాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేసి వారిని చైతన్య పరచాలని వైసిపి ఆ పార్టీ నాయకులకు దిశ నిర్దేశం చేసింది.

# మద్యం మత్తులో డ్రైవింగ్

### - జాతీయ రహదారిపై పడిన గ్రానైట్ బండలు



**సింగరాయకొండ,మార్చి 5,ప్రభాతవార్త**
మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై కంటైనర్ లారీలో గ్రానైట్ బండలుతో వెళ్తూ రోడ్డుపై బండలు పడిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం. నుస్సుమ్ తిరుమల తండ్రి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి AP39UE8199 నంబర్ గల కంటైనర్ లారీతో బల్లికురవలోని కాశిరెడ్డి క్వారీ నుంచి రెండు భారీ గ్రానైట్ బండలను లోడ్ చేసి బెంగళూరు వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఎంఎస్ఆర్ ఫ్యాక్టరీ సమీపానికి చేరుకోగానే లారీ అదుపుతప్పింది. డ్రైవర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా, అతివేగంగా లారీ నడపడం వల్ల వాహనం జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పైకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో లారీలో ఉన్న రెండు పెద్ద గ్రానైట్ బండలు రహదారిపై పడిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ బి.మహేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రహదారిపై పడిన గ్రానైట్ బండలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండాచర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గిట్టుబాటు ధర కోసమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

### - పొదిలి ఏఎంసీ చైర్మన్ ఇమాంసా



**కొనకనమిట్ల, మార్చి 5, ప్రభాతవార్త**
రైతులు పండించిన కందులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని పొదిలి ఏఎంసీ చైర్మన్ సయ్యద్ ఇమాంస అన్నారు. మండలంలోని నాగరాజుకుంట, చిన్నారికట్ల గ్రామాలలో శుక్రవారం కందుల కొనుగోలు కేంద్రాలను నాయకులతో కలిసి ప్రారంభించారు. కందులు క్వింటా ధర రూ.8 వేలు ఉంటుందని, బయట ఎవరు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. దర్శి డివిజన్ ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతులకు ఖచ్చితంగా ప్రభుత్వం మద్దతు ధర రూ.8వేలు ఇస్తుందన్నారు. దళారులను నమ్మి కందులు విక్రయించి మోసపోవద్దని తెలియజేశారు. వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు మాట్లాడుతూ కంది పంట వేసిన ప్రతి ఒక్క రైతు ముందుగా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ చేయించుకొని కందులు అమ్ముకోవాలని కోరారు. అదే విధంగా మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు, నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాసాపతి నాయుడు, ఏదుబాటి వెంకట నారాయణ, వరికూటి వెంకటరామిరెడ్డి, రేగడపల్లి సింగిల్ విండో అధ్యక్షులు కనకం నరసింహారావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పి.తిమోతి, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ కామసాని వెంకట సుబ్బారెడ్డి, వ్యవసాయశాఖ, పీఏసీఎస్ సిబ్బంది, ఆ గ్రామ రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న దద్దాల



**హనుమంతునిపాడు, మార్చి 5, ప్రభాతవార్త**
మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి - భాగ్యమ్మ దంపతుల నివాసంలో గురువారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజక వర్గం ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు విషయాలు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, మల్లెల వెలుగొండయ్య, బలసాని బాల్స్వామి, మిట్ట రమేష్‌రెడ్డి, కేతిరెడ్డి సురేష్‌రెడ్డి, కేతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మిట్ట తిరుపతయ్య, కేతిరెడ్డి వెంకటరెడ్డి, బంగారు బ్రహ్మయ్య, పోరెడ్డి వెంకటేశ్వర్లు, రాప్తాటి నారాయణ, కలుకూరి బాల గురవయ్య, బొల్లం కేశవులు, అప్పిచర్ల సుబ్బారెడ్డి, కొదముల జఫన్య, కొదమల జోసఫ్, కోలా మత్తయ్య, కోలా యోహాను, కొదముల మోజేష్, దువ్వూరి నాగమయ్య చారి, మద్ది లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## లవణ్ నేషనల్ మీన్స్ కం మెరిట్ టెస్ట్ స్కాలర్‌షిప్‌కి ఎంపిక



**లింగసముద్రం, మార్చి 5, ప్రభాతవార్త**
మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలోని మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న నేలపాటి లవణ్‌కుమార్ గురువారం విడుదల చేసిన నేషనల్ మీన్స్ కం మెరిట్‌టెస్ట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,సిబ్బంది లవన్‌కుమార్‌ను అభినందించారు.

## ఆర్డిటి ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం





**పెద్దదోర్నాల, మార్చి 5, ప్రభాతవార్త**
దోర్నాల సుందరయ్య కాలనీలోని ఆర్‌డీటీ కమ్యూనిటీ భవనంలోని గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమం డాక్టర్ హర్షరెడ్డి, డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో ఆర్డీటీ సహకారంతో ప్రతి సంవత్సరం ఉచిత కంటి చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా గురువారం దోర్నాల మండలంలోని 25 గ్రామాలలోని 170 మంది రోగులను పరీక్షించి అందులో 103 మందికి గ్లాసెస్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. 26 మంది ఆపరేషన్‌కు సెలెక్ట్ కావడం జరిగింది. మిగిలిన 4 కేసులను హైరిస్క్ కేసులుగా గుర్తించి వీరిని హయ్యర్ ఇనిస్టిట్యూషన్‌కు రెఫర్ చేయడం జరిగింది. మిగిలిన 37 కేసులు నార్మల్ కేసులుగా గుర్తించి వారికి ఐ డ్రాప్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. 26 మందికి కంటి శుక్లం కేసులుగా గుర్తించి గజ్వేల్ కంటి హాస్పిటల్ నందు ఆపరేషన్ చేయించడం జరుగుతుందని తెలిపారు.

## కందుకూరు కెజీబీవిని సందర్శించిన డీఈవో

### - అపరిశుభ్రతపై ఆక్షేపణ



**కందుకూరు మార్చి 5, ప్రభాతవార్త**
కందుకూరులోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని నెల్లూరు జిల్లా డీఈవో బాలాజిరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాలయ నిర్వహణా తీరుతెన్నులను పరిశీలించారు. రిజిస్టర్లును క్షేత్రస్థాయితో పరిస్థితితో పోల్చి చూశారు. పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్రతను ఆక్షేపించారు. 10వతరగతి విద్యార్థుల 100రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలుతీరును నిశితంగా గమనించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో ముఖాముఖి సంభాషించారు. విద్యాబోధన,మద్యాహ్న భోజన నిర్వహణ, ఇతర వసతులు ఏర్పాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రణాళికా బద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో చేపట్టాల్సిన మెళుకవలను వివరించారు. మెరుగైన ఫలితాలసాధనకు కృషిచేయాలని నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ కె.సుబ్బారెడ్డితోపాటు విద్యాలయం సిబ్బంది ఉన్నారు.

## సమస్యలపై సబ్‌కలెక్టర్‌కి వినతిపత్రం



**కందుకూరు మార్చి 5, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నేతలు గురువారం కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీని కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలపై ఈ నెల 6న మంగళగిరి సీసీఎల్ఏ ఆఫీస్ వద్ద సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 8 ఏళ్లుగా వీఆర్ఏలకుజీతాలు పెంచక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలకు రూ.26 వేలకి వేతనం పెంచాలని,నైట్ డ్యూటీలు రద్దు చేయాలని,అర్హతలకు తగిన ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని సంఘనేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సామూహిక రాయబారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గంటనపల్లి శ్రీనివాసులు, కందుకూరు మండల గౌరవాధ్యక్షులు ఎస్ఏ గౌస్, జిల్లా కోశాధికారి ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ రజతోత్సవ వేడుకల్లో కలెక్టర్ వినోద్ కుమార్



**వేటపాలెం, మార్చి 5, ప్రభాతవార్త**
సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కళాశాల రజతోత్సవ వేడుకలు, జాతీయ టెక్నికల్ సింపోజియం సాసెట్ రజితోత్సవ్ 2026 ఘనంగా ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. గెస్ట్ ఆఫ్ హానర్, మాజీ మంత్రి వర్యులు కళాశాల ఫౌండర్ చైర్మన్ వనమా వెంకటేశ్వరరావు కళాశాల రజతోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ క్యాక్రమానికి బాపట్ల జిల్లా కలెక్టర్, మాజి స్ట్రేట్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేసి కళాశాల సెల్ఫి పాయింట్‌ను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాల యాజాన్యం 25 సంవత్సరాల పాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు అందించిన సేవలను కొనియాడారు. కలెక్టర్ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన దానిలో కృషి చేసి ఉన్నత స్థాయిలో స్థిర పడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడి వారు తమ కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకుని వెళ్లాలని సూచించారు. సమాజానికి, తమ వర్గ అభివృద్ధికి సైనికుని వలె కృషి చేయాలని కోరారు. తద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. తదుపరి రజితోత్సవ సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం తరుపున ఉన్నత స్థాయిని సాధించిన వివిధ విద్యార్థులను కలెక్టర్ సత్కరించారు. కళాశాల ఫౌండర్ చైర్మన్ వనమా వెంకటేశ్వరరావును, మేనేజ్‌మెంట్ సభ్యులను ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. కళాశాల రజతోత్సవ వేడుకల సందర్భంగా కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను యాజమాన్యం ప్రారంభించారు. విద్యార్థులు కళాశాల గార్డెన్‌లో ప్రదర్శించిన సామూహికంగా డాన్సు వీక్షకుల్లో ఉత్సాహం నింపిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ బాబు, చైర్మన్ వనమా రాఘవేంద్రరావు, వైస్ చైర్మన్ బి.ఫణి రాజు, కళాశాల డైరక్టర్‌లు, యాజమాన్యం, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**వేటపాలెం, మార్చి 5, ప్రభాతవార్త**
మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు, సైబర్ నేరాలపై ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీవెస్ సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి తెలిపారు. గురువారం వేటపాలెం రైల్వే స్టేషన్ రోడ్డులో గల అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పదవీ విరమణ చేసిన వారి పట్ల డిజిటల్ అరెస్టులు చేస్తున్నట్లు మెసేజ్‌లు, వీడియో కాల్స్ వస్తున్నట్లు మాధ్యమాల ద్వారా తెలుస్తున్నట్లు వివరించారు. క్షణమే స్పందించి సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి, రక్షణ పొందాలని ఆమె వివరించారు. 18 ఎండ్లు నిండని యువతలకు పెళ్లిళ్లు, జరుగుతున్నట్లు సమాచారాలు అందుతున్నాయని, ఆ విషయం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకునేందుకు పోలీసులను, జిల్లా స్థాయిలో ఉన్న చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ వారికి సమాచారాన్ని అందించాలని అన్నారు. యువతలను విద్య పట్ల ఆకర్షితులయ్యే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల నుండి వారిని చైతన్య పరచాలని సూచించారు. సఖి వన్ స్టాప్ కౌన్సిలర్ బేబీ, వెలుగు సీసీ అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా

**రాచర్ల, మార్చి 5, ప్రభాతవార్త**
మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి గిద్దలూరు ఏజే సిజేఎం కోర్టు న్యాయ అధికారి భరత్ చంద్ర 60రోజులు శిక్ష, రూ.10వేలు విధించారని రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన సూరా రాజశేఖర్ రెడ్డి అని వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో తమకు పట్టుబడ్డాడని అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయ అధికారి జరిమానాతోపాటు శిక్ష విశించారని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే శిక్షలు జరిమానాలు కఠినంగా ఉంటాయని, ఈ సందర్భంగా ఆయన మద్యం సేవించి వాహనాలు నడిపే వ్యక్తులకు హెచ్చరికలు చేశారు.

### మార్కాపురం జిల్లాకు నూతన హౌసింగ్ పిడిగా ఎంవి మోహన్‌రావు



**మార్కాపురం, మార్చి 5, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా నూతన హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పిడి)గా ఎంవి మోహన్‌రావు గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా హౌసింగ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలను పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో పేద మరియు అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ నిర్మాణం పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఇప్పటికే మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ పథకాల అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని నూతన పీడీ మోహన్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో హౌసింగ్ పథకాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టిన తరువాత కలెక్టర్ పి రాజబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. అయన నెల్లూరు హౌసింగ్ ఈఈ గా చేస్తూ పదోన్నతిపై పిడిగా వచ్చారు.

## ఆధ్యాత్మిక సేవలతో సమాజాభివృద్ధికి కృషి చేయాలి

**- చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ చిలక ఇజ్రాయిల్ పిలుపు**



**మార్కాపురం, మార్చి 5,ప్రభాతవార్త**
వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక, ఆర్థిక సహకారం అందిస్తూ ముందుకు సాగాలని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ చిలక ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. మార్కాపురంలోని స్పైసీ హోటల్ సమావేశ మందిరంలో గురువారం మార్కాపురం జిల్లాలోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సువార్తికులు, డైరెక్టర్లు, అడ్వైజర్లతో జిల్లా కమిటీ సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ ఆర్ సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ సింగా రాజేష్ మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలోని క్రీస్తు సంఘాల సువార్తికులు, డైరెక్టర్లు, అడ్వైజర్లతో నూతన జిల్లా కమిటీని ఈనెల 19న ఎన్నుకోనున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ద్వారా సమాజంలోని పేద వర్గాలకు, ముఖ్యంగా పేద సువార్తికులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల 19న జరగనున్న నూతన కమిటీ ఎన్నికలకు జిల్లాలోని క్రీస్తు సంఘాల సువార్తికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు సంఘం డైరెక్టర్లు యేసయ్య, చాట్ల గంగయ్య, గురవయ్య, ప్రభుదాస్ తదితరులు, జిల్లాలోని పలువురు సువార్తికులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమంతో రైతులకు అవగాహన

**- కంది, శనగ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచన**



**మార్కాపురం, మార్చి 5, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని గజ్జలకొండ, రాయవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిని కే బుజ్జిబాయి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై పంటల కొనుగోలు, మద్దతు ధరలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని కే బుజ్జిబాయి మాట్లాడుతూ మార్కాపురంలో ప్రస్తుతం కంది, శనగ పంటల కొనుగోలు కేంద్రం ప్రారంభించామని తెలిపారు. కంది మరియు శనగ పండించే రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డుతో వేలిముద్ర నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కంది పంటకు క్వింటాల్‌కు రూ.8వేలు, శనగకు క్వింటాకు రూ.5875లు మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పవనేశ్వరి, సాయి దీక్షిత్‌రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రకాశం కాలేజిలో మహిళా దినోత్సవం



**కందుకూరు మార్చి 5, ప్రభాతవార్త**
మహిళలు సాదికారితవైపు పయనించాలని కందుకూరు రూరల్ ఎస్సై ఏ బాలక్రిష్ణ విద్యార్థినిలకు సూచించారు. ఇందుకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు చట్టాలును వినియోగించు కోవాలని ఆయన సూచించారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగముగా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్క్రీన్ ప్రజెంటేషన్ ఇస్తూ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు కళాశాల యాజమాన్యం పాల్గొని మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

## గణపవరం, ఎండూరివారి పాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**త్రిపురాంతకం, మార్చి 5, ప్రభాతావార్త**
మండలంలోని గణపవరం, ఎండూరివారిపాలెం గ్రామలల్లోమండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న రైతులందరితో మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వర రెడ్డి మాట్లాడుతూ రైతులందరు కూడా రైతు ఐడి (భూ ఆధార్ ) తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు రైతు ఐడి ముఖ్యమని తెలియజేశారు. అదే విధంగా ఎండూరివారిపాలెం గ్రామంలోని మినుములు, పత్తి పంటలను సందర్శించి పంటలోని తెగుళ్లు, పురుగులు వాటి ప్రభావం పై ఎటువంటి చర్యలు, జాగర్తలు తీసుకోవాలో రైతులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. అదే విధముగా మినుములో పచ్చ దోమ, పేనుబంక పురుగు ఉధృతి కనిపించంచటం జరిగింది, దాని నివారణకు గాను తాయోమిథక్సిన్ లేదా ఇమిడాక్లోప్రైడ్ ఎదో ఒకటి పిచికారీ చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామం పెద్దలు అదేవిధంగా గ్రామ వ్యవసాయం సహాయకులు వెంకట రామిరెడ్డి, చిన్న మస్తాన్ నాయక్ పాల్గొన్నారు.

## త్రిపురాంతకం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివరామయ్య



**త్రిపురాంతకం, మార్చి 5,ప్రభాతావార్త**
త్రిపురాంతకం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్‌గా బి శివరామయ్య గురువారం నూతనంగా విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టిన ఎస్సై శివరామయ్యకు స్థానిక పోలీస్ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్సై శివరామయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రజలు పోలీస్ శాఖా పరంగా ఏ సమస్య ఉన్న తమను స్వయంగా కలిసి సమస్యలు తెలియజేసి పరిస్కారం చేసుకోవచ్చని అందరికీ అందుబాటులో ఉంటానని, మండలంలో శాంతి భద్రతల సమస్యలు ఎక్కడ తలెత్తకుండా పని చేస్తానని ఆయన అన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ అబ్దుల్ సత్తార్



**కంభం, మార్చి 5 ,ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని స్థానిక పార్కు వీధిలోగల ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో అబ్దుల్ సత్తార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాలు, జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా అభ్యసన స్థాయిలను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.గ్యారెంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి కార్యాచరణ ప్రాణానికి ద్వారా వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో విద్యార్థులందరినీ స్కై లెవెల్‌లో ఉంచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. 75 రోజుల కార్యాచరణ ప్రాణాలికలు 60 రోజుల ప్రగతిని సమీక్షించారు. ఉర్దూ భాషలో అక్షరాలు ఎంపిక ద్వారా పదాలను సృష్టిస్తూ ప్రతి పదార్థాలను వివరిస్తూ అలవోకగా ఉర్దూ భాషపై పట్టుబిగిస్తున్న విద్యార్థులను ఎంఈఓ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సిఆర్పి మురళీమోహన్, ప్రధానోపాధ్యాయురాలు డివి అరుణ,ఉపాధ్యాయులు రేష్మ భాను,కాశీం భాష తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం పురోగమనం

**- రానున్న రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు పరుగులు తీయనున్న పారిశ్రామిక రంగం**



**కంభం, మార్చి 5 ,ప్రభాతవార్త**
ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రం పురోగమనం వైపు దిశగా పరుగులు తీస్తుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం కంభం పట్టణంలో పార్టీ మండల అధ్యక్షులు బాదం కిషోర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ గత 5 సంవత్సరాల వైసిపి ప్రభుత్వ హయాంలో ఏపీ రాష్ట్రం విధ్వంసం బాటలో పయనించిందని,దీంతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతోపాటు ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని నాటి జగన్ పాలనను తీవ్రంగా విమర్శించారు. అయితే 2024లో రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన గాడిలో పడడమే గాక మరోవైపు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఏపి రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. మోడీ ప్రభుత్వం అభయం ఇవ్వడం ద్వారానే మన రాష్ట్రానికి రూ.20లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఆయన అన్నారు. తద్వారా రాష్ట్రంలో నూతన పరిశ్రమలు స్థాపనం జరగడంతోపాటు లక్షలాది మంది యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా పెద్ద పెద్ద బహుళ జాతి సంస్థలు మన రాష్ట్రానికి తరలి రానున్నాయని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల ఫలితంగా అంతర్జాతీయంగా భారత దేశం కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగాయని ఆయన అన్నారు. మార్కాపురం జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కానున్నాయని అన్నారు. 11ఏళ్ల మోడీ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి నారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖాళీ సీట్ల భర్తీకి 8న ప్రవేశ పరీక్ష

**రాచర్ల, మార్చి 5 , ప్రభాతవార్త**
రాచర్ల ఫారంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 6,7,8,9,10తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 8వ తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ మేరీ మంజుల తెలిపారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె తెలిపారు.6,7తరగతులకు ఉదయం 10 నుండి 11:30 వరకు, 8, 9, 10తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుండి 3:30గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ విషయం గమనించాలని ఆమె కోరారు.

### రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలి



**ముండ్లమూరు, మార్చి 5, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని పులిపాడు, పెద్ద ఉల్లగల్లు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమలరావు మాట్లాడుతూ రైతులందరూ రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలని, రైతు రిజిస్ట్రేషన్ ఐడీ ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ నిర్మల, క్రాంతి రత్న, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- అడ్వకేట్ మునగా వెంకట సాయికుమార్**



**దర్శి, మార్చి 5, ప్రభాతవార్త**
ప్రతి రోజు వారి జీవితంలో ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం పెరిగినందున మనం వాడుతున్న చరవాణికి వివిధ మార్గాలలో సైబర్ నేరగాళ్లు లింకులు చేరవేసి సదరు లింకులపై మన క్లిక్ చేయటం ద్వారా మన ఖాతాలోని డబ్బు వేరు ఒక అనుమానస్పద ఖాతాలోకి జమకావటం జరుగుతుంది అటువంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి అకౌంట్ నిలుపుదల చేసుకోవాలి. అదే విధంగా ఏపీకే పేరుతో వచ్చే పైలు పట్ల జాగ్రత్తగా ఉండాలని అడ్వకేట్ మునగా వెంకట సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# ఉమెన్స్ యాక్ట్‌పై అవగాహన



**దర్శి, మార్చి 5, ప్రభాతవార్త**
ఉమెన్స్ డే 20 డేస్ సెలబ్రేషన్‌లో భాగంగా గురువారం అర్బన్ క్లినిక్ దర్శిలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి, ఉమెన్స్ యాక్ట్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథిగా ఎస్‌డబ్ల్యూఎం వీరాంజనేయులు ఒంగోలు నుంచి పాల్గొని చైల్డ్ రిలేటెడ్ అండ్ ఎడ్యుకేషన్ చైల్డ్ లేబర్ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఆర్.పరిమళ మాట్లాడుతూ మహిళలకు వచ్చే సమస్యలపై బాల్య వివాహాలపై అవగాహన కల్పించడం జరిగింది. హెల్త్ సూపర్‌వైజర్ సుహాసిని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిల్లలను చదువుకి ఇంపార్టెన్స్ ఇవ్వాలని, లింగ వివక్షత చూపించకూడదని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసీడీవెస్ సూపర్‌వైజర్ సుభాషిని, కమల కుమారి, అనురాధ, సునీత, ఇందిర, ఏరియాలో ఉన్న గర్భవతులు, బాలింతలు, లబ్ధిదారులు, తల్లులు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంతనూతలపాడులో ఇళ్ల పన్నులు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్



**సంతనూతలపాడు, మార్చి 5, ప్రభాతవార్త**
సంతనూతలపాడు కేంద్రంలో గురువారం నాడు ఇల్లా కలెక్టర్ పి.రాజాబాబు, డీపీవో వెంకటేశ్వరరావు, సీఈఓ చిరంజీవి ఆదేశాలు మేరకు సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో సంతనూతలపాడు గ్రామ పంచాయతీ సిబ్బంది ఇళ్ల పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పన్నులను చెల్లించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో సురేష్‌బాబు ఈ సందర్భంగా కోరారు. ఎంపీడీవో సురేష్‌బాబు సంతనూతలపాడు సచివాలయంలో ఇళ్ల పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గుంజి రాజు 45,770, కుంచాల నాగలక్ష్మి 2987 రూపాయల పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన విధానాన్ని ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించి వారికి ఆన్‌లైన్ రసీదులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, బిల్ కలెక్టర్ బాబురావు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వై.మణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, స్థానిక సచివాలయ సిబ్బంది సంతనూతలపాడులో ఇళ్ల పన్నులు వసూళ్లపై ముమ్మరంగా ఇంటింటా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

### సైబర్ క్రైమ్స్‌పై అవగాహన

**సంతనూతలపాడు, మార్చి 5, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం సాయంత్రం చీమకుర్తి ఆర్థిక అక్షర కేంద్రం ఆధ్వర్యంలో తక్కెళ్ళపాడు గ్రామంలో డిజిటల్ పేమెంట్లు, సైబర్ క్రైమ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు పట్ల సరైన అవగాహన కలిగి సైబర్ క్రైమ్స్‌కు గురి కాకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. ఆన్‌లైన్ నమోదు, బ్యాంకు డిజిటల్ పేమెంట్‌పై క్యాంపులో గ్రామస్తులకు వివరించారు.ప్రతి వ్యక్తి కూడా భీమా పాలసీ నమోదు చేసుకోవాలని, బ్యాంకులో ఉన్నటువంటి ఇన్సూరెన్స్‌లన్నింటిని గురించి గవర్నమెంట్ సర్వీసెస్ స్కీమ్స్ గురించి తెలియజేశారు. ఈ క్యాంపులో డిస్టిక్ కోఆర్డినేటర్ బి.శ్రీను, కౌన్సిలర్స్ ఏ.చిన్నరాజా, ఎస్.అమృత రాజు, గ్రామస్తులకు వివరించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

**- జర్నలిస్టు మాధవరావుకు సంఘీబావం తెలిపిన నేతలు**



**కందుకూరు మార్చి 5, ప్రభాతవార్త**
కందుకూరు పట్టణంలోని శ్రీ స్కందపురి జనార్ధన్ స్వామి దేవస్థాన కళ్యాణ మండపం నందు గురువారం సీనియర్ జర్నలిస్టు ఉప్పుటూరి మాధవరావు,లక్ష్మిల ఏకైక పుత్రుడు రవి కిషోర్‌బాబుకు వధువు స్వాతితో వివాహం జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయనేతలు, బందుమిత్రులుతోపాటు సహచర జర్నలిస్టులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాధవరావుకు సంఘీబావం తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డా॥దివి శివరామ్,కందుకూరు వైసీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు,సీపిఎం సీనియర్‌నేత ముప్పరాజు కోటయ్య,తెదేపా సీనియర్ నేతలు వడ్లమూడి సురేష్,గుర్రం మాల్యాద్రి,దామా మల్లేశ్వరరావు,వైసీపీ నేతలు గంగిరెడ్డి,లాయర్ పెన్నా క్రిష్ణయ్య, షేక్ రఫీ, ఎంపీపీ భర్త ఇంటూరి శ్రీను,సర్పంచ్‌లు వెంకటరావు,కుమ్మర బ్రహ్మయ్య,జర్నలిస్టులు కె.హరిబాబు,ఎన్.కోటేశ్వరరావు, కామేపల్లిరమణయ్య,ఎన్.సుధీర్,గుర్రం నారాయణ,ప్రసాదరావు,మల్లికార్జునరావు,మల్లి మాలకొండయ్య, ఆసీప్, చక్కాకేశవులు,మురళి, నాగేశ్వరరావు,నాగభూషణంతోపాటు పలువురు ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కస్తూరిబా విద్యాలయంలో మహిళా దినోత్సవం



**కందుకూరు మార్చి 5, ప్రభాతవార్త**
గర్భస్థశిశు లింగనిర్ధారణతో పాటు భ్రూణహత్యలు చట్టరీత్యానేరమని పోలినేనిపాలెం కస్తూరిబా విద్యాలయం ప్రిన్సిపల్ అరుణకుమారి అన్నారు. గురువారం కందుకూరు ప్రాజెక్టు వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిపాలెం కేజీబీవీ నందు పిసిపిఎన్‌డిటి మరియు ఏఆర్‌హెచ్‌లపై కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సునీత అధ్యక్షతన జరిగిన ఈ సదుస్సు లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.గర్భధారణకు ముందు తర్వాత గర్భస్తశిశు లింగనిర్ధారణ పూర్తినిషేధమన్నారు.ఉల్లంఘించిన వారిపై నేరపవృత్తిరీత్యా తగిన జరిమానాతోపాటు జైలుశిక్ష పడుతుందన్నారు.సునీత మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందుస్తుగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మిషన్ శక్తి 20 రోజుల ప్రోగ్రాంకు అనుసంధానంగా సీడీపీవో ఉషారాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు సూపర్వైజర్ తెలిపారు.ఇందులో బాగంగా కిశోర బాలికలకు మరియు ఉపాధ్యాయినిలకు గర్భస్థ శిశులింగ నిర్ధారణ నిషేధ చట్టం వివరించారు.కిశోర బాలికల పౌష్టికాహారం,లైంగిక ఆరోగ్యం,వ్యక్తిగత పరిశుభ్రత,రుతుశుభ్రత తదితర అంశాల గురించి ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో టీచర్సు పద్మజతోపాటు పలువురు విద్యార్ధినిలు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ - 2 నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు



**కందుకూరు మార్చి 5, ప్రభాతవార్త**
గ్రామ పంచాయతీలకు ఏప్రిల్ 2నుంచి ప్రత్యేక అధికారుల పాలన రానుంది.సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుండడంతో ఆయా పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక పాలన కొనసాగనుంది.ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలిస్తుంది.సర్పంచుల పదవీ కాలం ఏప్రిల్ 2 తో ముగియనుంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంతకంటే ముందు,ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతోప్రత్యేక అధికారులపాలన అనివార్యమైంది.ఈలోగా కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం,రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

## ఎస్సై జి.రాంబాబును కలిసిన టీడీపీ నాయకులు



**లింగసముద్రం, మార్చి 5, ప్రభాతవార్త**
లింగసముద్రం మండల కేంద్రం లింగసముద్రం పోలీసు స్టేషన్ నూతన ఎస్సై జి.రాంబాబును పెద పవని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షేక్ రఫీ, కరీముల్లా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### కేవీకే శివ వృక్ష మిత్ర కార్యక్రమం



**దర్శి, మార్చి 5, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శివ వృక్ష మిత్ర కార్యక్రమంలో భాగంగా కేవీకే ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని దోర్నాల మండల గిరిజన రైతులతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేవీకే హెడ్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ ఈ శివ వృక్ష మిత్ర అనే కార్యక్రమాన్ని మన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చెట్లను నాటడం, ప్రకృతిని రక్షించడం, పచ్చని భారతదేశాన్ని నిర్మించడం, ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి నాంది పలికారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దాని సెల్ఫీని పంచుకోవడం ద్వారా సర్టిఫికేట్ పొందుతూ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ఈ కార్యక్రమం ద్వారా శివరాజ్ సింగ్ చౌహాన్ ఒక చెట్టును నాటండి ప్రకృతికి స్నేహితుడిగా మారండి అనే నినాదాన్ని తెలియజేశారన్నారు. అటు తరువాత కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో కేవీకే సిబ్బంది రైతులతో కలిసి మొక్కలను నాటారు.

## పది విద్యార్థులకు అల్పాహారం అందజేత



**దర్శి, మార్చి 5, ప్రభాతవార్త**
దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు స్టడీ అవర్ సమయంలో అల్పాహారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒక వారం రోజులకు అయ్యే ఖర్చు పాఠశాలహెచ్ఎం పి.రంగారావుకి అందజేయడమైంది. దర్శి ఎంఈఓ కే.మాలకొండయ్య, సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, దర్శి ప్రధాన కార్యదర్శి గొర్రెపాటి వేణు, ఉపాధ్యాయులు పీవీ నారాయణ, ప్రభుదాసు, వి.గోపిలు విద్యార్థులకు అల్పాహారం అందజేశారు.

## కొర్రపాటి వారి వివాహ వేడుకలో వైసీపీ నాయకుల సందడి



**కనిగిరి, మార్చి 5, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని పవిత్ర కన్వెన్షన్ హాల్‌లో గురువారం కొర్రపాటి కుటుంబ వివాహ మహోత్సవం ఆహ్లాదభరిత వాతావరణంలో జరిగింది. కొర్రపాటి ఓబులేష్-లక్ష్మీ దంపతుల కుమారుడు శ్రీనివాసులు, అంజలి వివాహ వేడుకకు రాజకీయ, సామాజిక వర్గాల ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, సిరువ గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, అయ్యన్నకోట రంగయ్య తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుక కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, స్నేహితుల సందడితో ఉత్సాహంగా కొనసాగింది.

## నూతన వధువు శిరీషను ఆశీర్వదించిన దద్దాల



**కనిగిరి, మార్చి 5, ప్రభాతవార్త**
కనిగిరి మండలం బాల వెంకటాపురం గ్రామంలో గురువారం మాదాల లక్ష్మణ-మల్లేశ్వరిల కుమార్తె శిరీష వివాహంలో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మడతల కస్తూరిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పోలక సిద్దారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరి, పోలంరెడ్డి బాలమల కొండారెడ్డి, గంగసాని రామసుబ్బారెడ్డి, గజ్జల కోటిరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, రామిరెడ్డి, పాశం కొండయ్య, కాసుల చిన్న గురవయ్య, చల్లగాలి నారాయణ, చల్లగాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పథకాల లబ్ధికి ఏపీఎఫ్ఆర్ నమోదు తప్పనిసరి

### - కందులు, శనగలకు గ్యారంటీ ధరతో మూడు కేంద్రాలు





**కనిగిరి, మార్చి 5, ప్రభాతవార్త**
కనిగిరి మండలంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వ్యవసాయశాఖ కీలక సూచనలు జారీ చేసింది. గురువారం బడుగులేరు, ఎడవల్లి గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులకుఅవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి షేక్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ పట్టాదారు పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతు ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లోతప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేయించుకోని రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. భూమి కలిగిన ప్రతి రైతు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉద్యానఅధికారి పి.విష్ణుప్రియ, వ్యవసాయ విస్తరణ అధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.నర్మదా, ఎన్.మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఇక రైతులు పండించిన కందులు, శనగలను ప్రభుత్వ కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు మండలంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కందులకు క్వింటాలుకు రూ.8వేలు, శనగలకు క్వింటాలుకు రూ.5,875 గ్యారంటీ ధర నిర్ణయించబడిందని వెల్లడించారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి లాభం పొందాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరకు పంట అమ్మాలంటే ముందుగా ఈ క్రాప్‌లో నమోదు చేసి, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రానికి వెళ్లి సీఎం యాప్‌లో బయోమెట్రిక్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. నమోదు సమయంలో సాగుదారుడి ఆధార్ నంబర్‌తో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు నమోదు చేస్తే, సాగుదారుడు వెళ్లలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు పంటను విక్రయించవచ్చని వివరించారు. నమోదు పూర్తి చేసిన రైతుల నుంచే కందులు, శనగలు స్వీకరించబడతాయని, కొనుగోలు చేసిన వారం రోజులలోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా చెల్లింపులు జమ చేయబడతాయని అధికారులు స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని కోరారు.

## ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన

### - పనుల నాణ్యతపై అబ్దుల్ గఫార్ దృష్టి



**కనిగిరి, మార్చి 5, ప్రభాతవార్త**
ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణ స్పందనగా కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను షేక్ అబ్దుల్ గఫార్ గురువారం స్వయంగా పరిశీలించారు. సాయి నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి, డ్రైనేజీ తదితర పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. పనులు పూర్తయిన తర్వాత మళ్లీ మరమ్మత్తులు అవసరం లేకుండా దృఢంగా నిర్మాణం చేయాలని పేర్కొన్నారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చైర్మన్ వెంట ఏఈలు మాధవ్, కోటేశ్వరరావు, మున్సిపల్ కార్యదర్శి షంషీర్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరగా, సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

## విడదల రజని, హర్షిత్ రెడ్డితో చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి భేటీ



**కనిగిరి, మార్చి 5, ప్రభాతవార్త**
ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రాజకీయ నేతలు గురువారం పరస్పర ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వర్యులు, చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజనితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిను రాష్ట్ర ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి ఆత్మీయంగా కలిసి అభివాదం చేశారు. కార్యక్రమం సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, యువత పాత్ర వంటి అంశాలపై నేతలు సౌహార్దపూర్వకంగా మరింత విస్తరించేందుకు సమన్వయంతో పని చేయాలని అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ భేటీ కార్యక్రమానికి హాజరైన కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. నేతల పరస్పర సంభాషణ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## 8వ వార్డు బూత్ ఇన్‌చార్జి షకీర్ అహ్మద్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**కనిగిరి, మార్చి 5, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణ 8వ వార్డు బూత్ ఇన్‌చార్జి షకీర్ అహ్మద్ జన్మదిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు, పట్టణ ప్రజలు, స్నేహితులు కూడా సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి షకీర్ అహ్మద్ చేస్తున్న సేవలను పలువురు నాయకులు కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.



## అట్టహాసంగా దామచర్ల సత్య జన్మదిన వేడుకలు

### - పాకల రోడ్డు నుంచి కళ్యాణ మండపం వరకు కోలాహలంగా ర్యాలీ

### - జి.ఎస్.కె సంస్థల అధినేత గంజి ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పాల్గొన్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలు







**సింగరాయకొండ,మార్చి 5 ప్రభాతవార్త**
రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) జన్మదిన వేడుకలు గురువారం మండల కేంద్రంలోని గంజి వారి కళ్యాణ మండపంలో అట్టహాసంగా నిర్వహించారు. జి.ఎస్.కె సంస్థల అధినేత గంజి ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలోతెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు ,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యకు ఘన స్వాగతం పలికారు. పాకల రోడ్డు నుంచి గంజి వారి కళ్యాణ మండపం వరకు డప్పు వాయిద్యాల సందడితో, బాణాసంచా కాలుస్తూ కోలాహలంగా ర్యాలీ నిర్వహించారు. కందుకూరు రోడ్డు సెంటర్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రివర్యులు దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంజి వారి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో దామచర్ల సత్య తనపై రూపొందించిన వీడియో సాంగ్‌ను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. గంజి ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించిన మండల నాయకులు, గంజి ప్రసాద్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం దక్కుతుందని చెప్పడంలో నేనే నిదర్శనమని, ప్రతి పక్షంలో నా వెంట నడిచిన నాయకులు,కార్యకర్తలు అండగా ఉండటంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆశీర్వాదంతో తనకు మారిటైమ్ బోర్డు చైర్మన్ పదవి లభించిందన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుర్తుండిపోయే విధంగా పాకల బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మనం చేసే ప్రతి కార్యక్రమం ప్రజలు గుర్తిస్తారని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తేదేపా అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, పాతసింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మ కర్తలి మండలి చైర్మన్ సన్నిబోయిన శ్రీనివాసులు, నాయకులు చీమకుర్తి కృష్ణ, షేక్ సందాని భాషా, కూనపు రెడ్డి సుబ్బారావు, శీలం సుబ్రహ్మణ్యం, మేకల అంకారావు, కాకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ హెల్త్ వెల్నెస్ సెంటర్ల తనిఖీ



**సింగరాయకొండ, మార్చి 5, ప్రభాతవార్త**
స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సింగరాయకొండ-1, సింగరాయకొండ-2 ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్నెస్ సెంటర్లలో గురువారం జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్ బాబు, నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.వి. సుబ్బలక్ష్మి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన వివరాలను క్రమం తప్పకుండా ఆర్‌సీహెచ్ పోర్టల్, యువిన్ పోర్టల్‌లలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ ఆయేషా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య, ఆరోగ్య సహాయకులు సయ్యద్ మసూద్ అలీ, సుభాకర్, పబ్లిక్ హెల్త్ నర్సులు విజయమ్మ, భారతి, జయభారతి, శైలజ, సీహెచ్‌వోసునీత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

### - డీపీఓ వెంకటేశ్వరరావు



**సింగరాయకొండ, మార్చి 5,ప్రభాతవార్త**
సింగరాయకొండ గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేసి మార్చి 15 నాటికి 100 శాతం పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు 179 అసెస్మెంట్ల ద్వారా రూ.2.75 లక్షలు మాత్రమే వసూలు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీకి మొత్తం డిమాండ్ రూ.239.2 లక్షలు ఉండగా ఇప్పటివరకు రూ.87.89 లక్షలు మాత్రమే వసూలు కావడంతో 36.74 శాతం మాత్రమే వసూళ్లు జరిగినట్లు తెలిపారు. మిగిలిన రూ.63.26 లక్షలను మార్చి 15లోపు వసూలు చేయాలని సూచించారు. పెండింగ్ బకాయిల వసూళ్ల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫీల్డ్ విజిట్ నిర్వహించినట్లు తెలిపారు. వసూళ్లలో నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి జయమణి, పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులు, హౌస్ టాక్స్ కలెక్షన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## చీరాల అభివృద్ధిపై పవన్‌కు ఎమ్మెల్యే కొండయ్య వినతి

### - నియోజకవర్గంలో రోడ్ల మరమ్మత్తులకు నిధులు కోరిన ఎమ్మెల్యే

### - నిధుల మంజూరుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ



**చీరాల, మార్చి 5, ప్రభాతవార్త**
చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా చీరాల నియోజకవర్గం ఎదుర్కొంటున్న శాఖాపరమైన ప్రధాన సమస్యలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వెల్లడించారు. మరమ్మత్తులకు నోచుకోని రహదారులతో పాటు, కీలకమైన తాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలంలోని గ్రామాలలో రోడ్ల మరమ్మత్తులకు కొత్త రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలోని చాలా రోడ్ల అభివృద్ధికి నోచుకోక, నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మత్తు పనులు కూడా చేపట్టకపోవడంతో అనేక గ్రామాలలో రోడ్లు చాలా అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతాలలోని ప్రధాన కల్వర్టులు రోడ్లు, గ్రామీణ ప్రాంతాల రోడ్లు దెబ్బతిన్న విషయాన్ని ఎమ్మెల్యే కొండయ్య, ఉప ముఖ్యమంత్రి పవన్ దృష్టికి తీసకెళ్లారు. ఇదే క్రమంలో జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన నీటి ప్రాజెక్టులు, ఇంకను గ్రామీణ ప్రాంతాలలో చేపట్టాల్సిన నీటి ప్రాజెక్టు గురించి క్షుణ్ణంగా విచారించినట్లు చెప్పారు. ఇక ఎమ్మెల్యే కొండయ్య, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన చీరాల అభివృద్ధి అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతే కాకుండా నిధుల మంజూరుకు భరోసా ఇచ్చారన్నారు. ఈ క్రమంలోనే పర్యాటకరంగా అభివృద్ధి చెందుతున్న చీరాల ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించాలని, ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. ఇదే క్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆహ్వానంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## అనారోగ్యానికి గురైన నాయకులకు పరామర్శ



**చీరాల, మార్చి 5, ప్రభాతవార్త**
టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న మైనార్టీ నాయకులు షేక్ మొహిద్దిన్‌అకస్మాత్తుగా అనారోగ్యపాలై కోలు కుంటున్న వారిని పరామర్శించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, మైనార్టీ రాష్ట్ర నాయకులు షేక్‌యాసిన్, సీనియర్ నాయకులు గుత్తి వెంకట శివయ్య, పట్టణ అధ్యక్షుడుగా పార్టీ గెలుపు కోసం కృషి చేసిన గజవల్లి శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ లాల్ అహమ్మద్, వైశ్య నాయకులు మురళి, మస్తాన్ వలీ పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిధిలో వేలం పాటలు



**అద్దంకి, మార్చి 5, ప్రభాతవార్త**
సింగరకొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో గురువారం ఉదయం 10 గంటలకు దేవస్థానంలో ఈ ఏడాది ఎప్రియల్ 1 నుండి వచ్చే ఏడాది 2027 మార్చి 31, 1 సంవత్సర కాలానికి దేవస్థానం వద్ద కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యములు అమ్ముకొనుట కొరకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనే హక్కునకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. అందుకు గాను అత్యధిక రేటు 2.50 లక్షలు లభించినట్లు, ఆలయ అధికారి వెల్లడించారు. అయితే గత సంవత్సరం పాట రూ.2,13,0000లు కాగ, ఈ సంవత్సరం 2,50,000లు ఆదాయం వచ్చింది, గత సంవత్సరం కన్నా రూ.37,000/ పెరిగినట్లు వివరించారు. ఈ పాటలు నిర్వాహణ కార్యక్రమము దేవాదాయశాఖ అధికారుల, కార్యనిర్వహణాధికారి, చైర్మన్ ధర్మకర్తల మండలి వారి పర్యవేక్షణలో జరిగింది.

## నేడు ధేనువకొండలో సైకిళ్ళు పంపిణీ చేయనున్న మంత్రి తనయుడు



**అద్దంకి,మార్చి 5,ప్రభాతవార్త**
విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ శుక్రవారంఉదయం 9.30గంటలకు ధేనువకొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు పంపిణీ చేయనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

## బాల్యవివాహం ఆపుదాం,బాలికల విద్యను కాపాడుదాం

### - విద్యాశాఖ అధికారి కె.వి.శ్రీనివాసరావు



**అద్దంకి ,మార్చి 5,ప్రభాతవార్త**
మహిళల హక్కులు, బాలికల భద్రత, వారి భవిష్యత్తు అభివృద్ధి గురించి సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసే సామాజిక సమస్యగా నిలుస్తున్నాయి అని అద్దంకి మండల విద్యాశాఖ అధికారి 2, కె.వి. శ్రీనివాసరావు తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల పాఠశాల నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని బాల్య వివాహాల అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన నీతి అయోగ్ డిపిఏ, పి. సిద్దిక్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టం విరుద్ధమైనవి మాత్రమే కాకుండా బాలికల హక్కులను వ్యతిరేకం. ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంది. 18 సంవత్సరంలోపు బాలికలకు, 21 సంవత్సరాల్లోపు బాలురకు వివాహం జరిపించడం చట్టపరంగా నేరమని ప్రజలు గుర్తించుకోవాలని ఆయన తెలియజేశారు. అద్దంకి పట్టణ ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ.ఇందిర మాట్లాడుతూ తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువత, సామాజిక సంస్థలు కలిసి బాల్య వివాహాలను అరికట్టడానికి ముందుకు రావాలి. ప్రతి బాలిక చదువుకొని సమాజంలో ఉన్నత స్థాయికి చేరేలా ప్రోత్సహించాలి బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతపై అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.నాగ ప్రసూన, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ.జయప్రద, అంగన్వాడి టీచర్లు, విద్యార్థినిలు, ఉపాధ్యాయుళ్ళు పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వాల్ పోస్టర్లను మండల విద్యాశాఖ అధికారి ఆవిష్కరించారు.

## నూతన వధూవరులకు చింతలపూడి శుభాకాంక్షలు



**అద్దంకి , మార్చి 5, ప్రభాతవార్త**
మండలంలోని కలవకూరు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ వైఎస్ఆర్సీపీ నాయకులు కామిరెడ్డి బలరామిరెడ్డి నివాసంలో వారి కుమారుడు సాయి దుర్గారెడ్డికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో అద్దంకి మండల వైఎస్ఆర్సీపీ కన్వీనర్ గుజ్జుల జగన్మోహన్ రెడ్డి, బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## 6 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 200 సబ్ స్టేషన్ల నిర్మాణం

### - విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం

### - కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల రాకతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం

### - అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, పవర్ స్టేషన్ల నిర్మాణం

### - ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి



**అద్దంకి, మార్చి 5,ప్రభాతవార్త**
రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.6 వేల కోట్లతో పనులు చేపట్టినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారి, ముత్తుముల అశోక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200 కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీటెండరింగ్ దశలో ఉన్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విజయనగరం జిల్లాలో రూ.46 కోట్ల వ్యయంతో 220 కేవీ, 132 కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా వేణుగోపాలపురంలో రూ.77 కోట్లతో సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు. విజయనగరంలో కూడా విశాఖపట్నం తరహాలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరగా, ఆ వ్యవస్థ ఖర్చుతో కూడుకున్నదని మంత్రి గొట్టిపాటి తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరగా, విద్యుత్‌శాఖ ఫీజిబిలిటీ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని, దీంతో రోజువారీ విద్యుత్ వినియోగం 263 మిలియన్ యూనిట్ల నుంచి 280 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే రైతులకు పెద్దఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రామిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## అమెరికా సుంకాలు వివిధ రంగాల ప్రభావం - లక్ష్మణరావు




**అద్దంకి, మార్చి 5, ప్రభాతవార్త**
జెవివి రాష్ట్ర అధ్యక్షులు కే ఎస్ లక్ష్మణ రావు అద్దంకిలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ అమెరికా ఆర్థికంగా వెనుక పడుతూ ఉండడం వల్లనే ఇతర దేశాలపై సుంకాలు విధించడంతోపాటు అక్కస్సు తో రకరకాల దాడులు చేస్తున్నది అని ఆయన అన్నారు. అమెరికా, డాలర్ విలువ క్షీణిస్తుండడంతో ట్రంపు అన్ని విషయాల్లో అవేశపడుతూ తున్నారని, లక్ష్మణరావు అన్నారు. భారతదేశంపై సుంకాల విధించడం వల్ల వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం ఏర్పడుతుందని లక్ష్మణరావు వివిధ కోణాలలో మాట్లాడారు. ఆయుధాల వ్యాపారం కోసం ఎప్పుడు తమ దేశం పెత్తనం చలా ఇస్తూ ఉండాలనే క్రమంలోనే ప్రపంచంలో పలు దేశాలు మధ్య అమెరికా వివాదాలకు ఉసికొల్పుతుందని అన్నారు. లక్ష్మణ్ రావు అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రపంచ దేశాలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తంగా శ్రీనివాసరావు, ఉబ్బా దేవ పాలన, డాక్టర్ కావూరు రఘు చంద్, డాక్టర్ వై హనుమంతరావు, జ్యోతి చంద్రమోళి, మన్నం త్రిమూర్తులు, తంగిరాల వెంకటేశ్వర్లు, సర్వేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, చెన్నుపాటి రామాంజనేయులు, అంకారావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

